నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, బుధవారం 8 మే 2024 | SIDDIPET


## అడుగడుగునా నీరాజనం



మెదక్ మున్సిపాలిటీ, మే 7: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ జిల్లా కేంద్రానికి వచ్చిన గులాబీ బాస్ కేసీఆర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. మంగళవారం కేసీఆర్ బస్సు యాత్ర రాందాస్ చౌరస్తాకు చేరుకోగానే బాణాసంచా కాలుస్తూ.. కేసీఆర్ వాహనంపై పూలవర్షం కురిపించారు. సాయంత్రం ఈదులుగాలులు, వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసినా కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన ప్రజానీకంతో పట్టణం కిక్కిరిసిపోయింది. ఆశేష జనవాహిని తరలిరావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ కనిపించింది. బస్సు యాత్ర వెంట బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా తరలివచ్చారు. గులాబీ జెండాలు, ఫ్లకార్డులు పట్టుకొని జై కేసీఆర్.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వాహనం రాందాస్ చౌరస్తాకు చేరుకోగానే అప్పటికే అక్కడ ఉన్న వేలాదిమంది ప్రజలు, అభిమానులు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. రోడ్డు షోలో పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



మెదక్ రాందాస్ చౌరస్తాలో కేసీఆర్ రోడ్‌షోకు హాజరైన అశేషజనం

మెదక్ రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి

# మెదక్ జిల్లా ఉండాల్నా.. పోవాల్నా

## సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లాను రద్దుచేస్తా అంటున్నడు

- నిధులు, ప్రాజెక్టులన్నీ ఎత్తుకుపోయిండ్రు
- మెదక్ గడ్డ చైతన్యవంతమైన తీర్పు ఇవ్వాలి
- రఘునందన్‌ను తుక్కుతుక్కుగా ఓడించాలి..
- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విద్యావంతుడు
- ఆయన్ను నేనే స్వయంగా తీసుకువచ్చాను..
- రూ. 100 కోట్లతో ట్రస్టు, నియోజకవర్గానికి ఒక ఫంక్షన్ హాల్ నిర్మిస్తానంటున్నాడు..
- ఎన్నికల ముందు ఏ అభ్యర్థి ఇలా చెప్పడు..
- వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి..
- మెదక్ రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

సిద్దిపేట, మే 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలను తీసేస్తా అని చెబుతున్నాడు. దానిలో మెదక్ జిల్లా కూడా తీసేస్తా అంటున్నాడు. మెదక్ జిల్లా ఉండాలా..? పోవాలా..? మెదక్ జిల్లా ఉండాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలవాలి..' అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో రోడ్‌షోలో భారీగా తరలివచ్చిన జనాన్నినుద్దేశించి కేసీఆర్ మాట్లాడుతూ... ఇక్కడ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. బ్రహ్మాండంగా రామాయంపేట రెవెన్యూ డివిజన్ చేసుకున్నామన్నారు. ఇదే కాంగ్రెస్, టీడీపీ రాజ్యంలో మొత్తం ఘనపురం ప్రాజెక్టును ఏవిధంగా నాశనం చేశారో మీ అందరికీ తెలుసన్నారు. అనేక బాధలు అనుభవించిన విషయాన్ని గుర్తుచేశారు. రూ.150 కోట్లతో ఘనపురం ఆనకట్ట బాగు చేసుకున్నామని గుర్తుచేశారు. ఆనకట్ట ఎత్తును పెంచుకున్నామన్నారు. ఆనాడు వంద పడకల దవాఖాన మెదక్‌కు కావాలని తెచ్చిపెట్టామన్నారు. ఇక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం దానిని 50 పడకలకు కుదించిందని ఆరోపించారు. ఏడుపాయల జాతరను బ్రహ్మాండంగా జరగాలని, ఆలయాన్ని బాగా అభివృద్ధి చేయాలని రూ.100 కోట్లు తాను మంజూరు చేస్తే దానిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొని పోయిందన్నారు. మెదక్ మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు, రామాయంపేట మున్సిపాలిటీ కోసం నిధులు మంజూరు చేస్తే వాటిని రద్దు చేశారన్నారు. ఇవన్నీ వాపస్ తీసుకుపోయారన్నారు. కాంగ్రెసోళ్లు కొత్త హామీలు అమలు చేయకపోగా, బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్లన్నీ రద్దు చేస్తున్నారని, ఈ విషయాన్ని మీరంతా గమనించాలని కేసీఆర్ కోరారు.

**ఇదే జిల్లా బిడ్డను..**

'ఇదే జిల్లా బిడ్డను, మీ అందరి కోసం ఎంత పని చేసినానో మీకు తెలుసు ..మెదక్ ప్రాంతాన్ని ఏవిధంగా అభివృద్ధి చేసుకున్నామో మీ అందరికీ తెలుసు'.. అని కేసీఆర్ అన్నారు. మెదక్‌లో హల్దీవాగు హరీశ్‌రావు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నట్లు చెప్పారు. దానిని మల్లన్నసాగర్‌తో లింక్ చేసుకున్నామన్నారు. హల్దీవాగు మీద ఎన్నో చెక్ డ్యామ్‌లు కట్టుకున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లింక్ కలుపుకొన్నట్లు తెలిపారు. ఎప్పుడు కూడా మంజీరా నది, హల్దీ వాగు ఎండిపోకుండా రైతుల పొలాలు పారేటట్లు అభివృద్ధి చేసుకున్నామన్నారు. దీనిని అంతా చెడగొట్టే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నదన్నారు. దీనిని మనం కాపాడుకోవాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. నదులను కాపాడుకోవాలన్న, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయించాలన్నా బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలన్నారు. 9 ఏండ్లు నిమిషం కరెంట్ పోకుండా రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చామన్నారు. ఇవాళ కరెంట్ కోతలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ది అసమర్థ ప్రభుత్వం అని కేసీఆర్ విమర్శించారు. రైతులకు మద్దతు ధర దక్కడం లేదని, బోనస్ రావడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమం జరిగిన రోజు మీరంతా తనను దీవించారన్నారు. ఐదు నెలల క్రితం తెలంగాణ ఎట్లా ఉండే ..ఈ ఐదు నెలల్లోనే ఎంత ఆగంఆగం అయితా ఉంది మీరంతా గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు చట్టబద్ధత చేస్తామని చెప్పారన్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి దగా చేసిందని, మోసం చేసిన విషయం మీ అందరికీ తెలుసన్నారు. వాళ్ల నోటికి వచ్చినట్టు వాగ్దానాలు చేశారని, వాళ్లు ఇచ్చిన ఏది కూడా అమలు కాలేదని అన్నారు. రైతుబంధు మీ అందరికీ వచ్చిందా అని కేసీఆర్ అడిగారు. రాలేదు అని..నిన్న మొన్న ఏస్తామనిచెప్పిండ్రు..మహిళలకు రూ.2500 వచ్చినాయా? మెదక్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు కదా వచ్చిందా? రాలేదా? దగా చేసినట్లు కాదా? రెండు లక్షల రుణమాఫీ జరిగిందా? ఇట్లా అనేక 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఏది చేయలేదన్నారు.

### రఘునందన్‌ను తుక్కుతుక్కు ఓడించాలి

'బీజేపీ అభ్యర్థి రఘునందన్ నూటికి నూరు అబద్ధాలు మాట్లాడుతారు. నరేంద్ర మోదీ ఎంత గ్యాసో..రఘునందన్ రావు ది కూడా అంతే గ్యాస్'.. అని కేసీఆర్ అన్నారు. అందులో ఏమి అనుమానం లేదని ..ఇది నిజమే కదా అని అన్నారు. దుబ్బాక ఎన్నికల్లో ఇదే కొత్త ప్రబాకర్‌రెడ్డి చేతిలో దాదాపు 55 వేల ఓట్లతో చిత్తు చిత్తుగా ఓడిపోయారని చెప్పారు. నేను ఒక్కటే మాట మిమ్మలి అడుగుతున్నాను.. అసెంబ్లీకే చెల్లని రూపాయి..మెదక్ పార్లమెంట్‌లో చెల్లుతుందా అని ప్రశ్నించారు. తక్కుతుక్కుగా ఓడగొట్టాలి, బుద్ధిచెప్పాలని ప్రజలకు కేసీఆర్ పిలుపునిచ్చారు. ఇష్టం వచ్చిన హామీలు ఇచ్చి మోసం చేస్తే ఇక్కడ మేము ఎడ్డివాళ్లం కాదని, తెలంగాణ మళ్ల ఒక్కసారి పిడికిలి బిగించి మనం పోరాటానికి దిగాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

### వెంకట్రామిరెడ్డి విద్యావంతుడు

మెదక్ పార్లమెంట్ నుంచి పోటీచేస్తున్న వెంకట్రామిరెడ్డి ఒక రిటైర్డు ఐఏఎస్ అధికారి అని కేసీఆర్ అన్నారు. ఇదే జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన వ్యక్తి అని, ఆయన డబ్బుల కోసం రాజకీయాలకు రాలేదన్నారు. ఈ ఎన్నికల్లో ఒక విద్యావంతుడు, తెలివి తేటలున్నవాడు వెంకట్రామిరెడ్డిని గెలిపించాలన్నారు. మిగతా అభ్యర్థుల గురించి మీకు తెలుసన్నారు. ఆయన డబ్బుల కోసం రాజకీయాలకు రాలేదన్నారు. ఆయనకు పదవి ఉంది ..ఆయన కేసీఆర్ వెంబడి ఉండి తెలంగాణ అభివృద్ధి చేయాలని , మెదక్ జిల్లాను మరింతగా అభివృద్ధి చేయాలని హరీశ్‌రావుకు తోడుగా ఉండాలని చెప్పి ముందుకు వచ్చాడని చెప్పారు. ఆయన్ను స్వయంగా తానే తీసుకువచ్చాను అని కేసీఆర్ చెప్పారు. ఎన్నికలకు రాగానే వెంకట్రామిరెడ్డి ఒక మాట చెప్పారన్నారు. రూ. 100 కోట్లతో ట్రస్టు పెడతానని, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తానని చెప్పిన విషయాన్ని కేసీఆర్ గుర్తుచేశారు. తన మాటను గౌరవించి వెంకట్రామిరెడ్డిని పెద్ద మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ కోరారు. రాళ్లవాన పడ్డది, అయినప్పటికీ తరలివచ్చినందుకు ప్రజలకు కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

### కదం తొక్కిన కామారెడ్డి

నిజామాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో వచ్చే కామారెడ్డి నియోజకవర్గంలో మంగళవారం కేసీఆర్ బస్సుయాత్ర సాగింది. కామారెడ్డి జిల్లాకేంద్రంలో నిర్వహించిన బస్సుయాత్రలో కేసీఆర్ ఆశేష జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కామారెడ్డి జిల్లాను కాపాడుకుంటారా... పోగొట్టుకుంటారా మీ ఇష్టం అని కేసీఆర్ చెప్పారు. కామారెడ్డి జిల్లా ఉండాలంటే కచ్చితంగా జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలవాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీలైతేనే మన సమస్యలపై కొట్లాడుతారని, మన భవిష్యత్తు కోసం పోరాడుతారని వివరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు అద్భుత స్పందన వచ్చింది. భారీ జనసందోహం మధ్య నిజాంసాగర్ చౌరస్తా నుంచి జేపీఎన్ రోడ్డు వరకు కేసీఆర్ బస్సుయాత్ర కొనసాగింది. జేపీఎన్ రోడ్డులో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు.



జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని కామారెడ్డి పట్టణం జేపీఎన్ రోడ్‌లో మంగళవారం నిర్వహించిన బస్సు యాత్రకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

### మోసపూరిత కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: హరీశ్‌రావు

మెదక్, మే 7 (నమస్తే తెలంగాణ): మోసపూరిత కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మెదక్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా కేసీఆర్ రోడ్‌షో, బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ మీద రాసిచ్చిన కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. మోసపూరిత కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. రూ.100 కోట్లతో సేవ చేసేందుకు ముందుకొచ్చిన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. మీ సేవకుడిగా ఉంటా, ఆశీర్వదించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లా చేసి 60 ఏండ్ల కలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్‌ను తిట్టడం కాదు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు.